క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపికయ్యారు. ఐటీఎం స్కిల్స్ అకాడమీ సంస్థ ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుంచి 37 మంది రాత, మౌఖిక పరీక్ష నిర్వహించి 13 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కంపెనీ ప్రతినిధులు మరో 15 మందిని తదుపరి ప్రక్రియకు ఎంపిక చేశారు. హెచ్ఆర్ మేనేజర్లు షహీనా, కళావతి నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు మునిస్‌ఖాన్, కె.అపర్ణ పర్యవేక్షించారు.

చలివేంద్రాలు ప్రారంభం



కొరిటెపాడు(గుంటూరు): పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను జేకేసీ కళాశాల రోడ్‌లోని కెనరా బ్యాంక్ రీజనల్ కార్యాలయం, ఏసీ కలాశాల కెనరా బ్యాంక్ వద్ద అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కెనరా బ్యాంక్ ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. మండు వేసవిని దృష్టిలో ఉంచుకొని, వేసవి కాలమంతా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ యు.రామ మోహన్ పాల్గొన్నారు.

తృతీయ ఫ్రంట్ మేనిఫెస్టో ఆవిష్కరణ

నెహ్రూ నగర్: తృతీయ ఫ్రంట్ మేనిఫెస్టోను శుక్రవారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ ఓ సమావేశ మందిరంలో శాసనసభ, పార్లమెంట్ ఇండిపెండెంట్ అభ్యర్థుల కామన్ అజెండా మేనిఫెస్టో ఆవిష్కరించారు. లోక్ తాంత్రిక జనతాదళ్ గుంటూరు ఎంపీ అభ్యర్థి బూరుగ రత్నం మాట్లాడుతూ బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఐక్య భారతీయ పార్టీలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న షేక్ సిలార్, డాక్టర్ తాత సేవ కుమార్, గుర్రం రామారావు, కొరివి రజినీకాంత్, కొండూరి నాగరాజు, జోసెఫ్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ నిర్వహించిన పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. గ్లాండ్ ఫార్మా హెచ్ఆర్ జనరల్ మేనేజర్ కె. శాంతి కిరణ సారథ్యంలో ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఎస్యూరెన్స్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో పాల్గొన్న 90 మంది విద్యార్థుల్లో 30 మందిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీతారామయ్య అభినందించారు.

ఎన్నికల ప్రచారం

లక్ష్మీపురం: ఇండియా కూటమి కాంగ్రెస్, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీలు బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుంటూరులో స్థానిక బీఆర్ స్టేడియం నుంచి హిందూ కాలేజ్ సెంటర్ మీదుగా పట్నం బజారు, పాత బస్టాండు సెంటర్ వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

పత్రికా స్వేచ్ఛపై సమావేశం

లక్ష్మీపురం: పత్రికలు, మీడియా నిష్పక్ష పాతంగా పని చేసే విధంగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయ, ఉద్యమ నాయకులు ఎ.వి.రామారావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. పౌర హక్కుల నాయకులు ఎల్.మురళీకృష్ణ మాట్లాడారు.

వాహనాల తనిఖీలు

పట్నంబజారు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం గుంటూరు బుడంపాడు బైపాస్, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో ఆర్టీఓలు ఎం.గోపాల్, ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, సంధ్య, సౌజన్యలతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిత్యం కొనసాగుతాయని తెలిపారు.



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి



జిల్లాకే తలమానికం..

విద్యా వైద్య రంగాలకు నిలయం

- నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన కళాశాలలు, ఆస్పత్రులు
- ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో నిత్యం వేల మందికి చికిత్స
- తూర్పు అసెంబ్లీ పరిధిలో ముస్లిం ఓటర్లు అధికం
- ఎన్నికల్లో అభ్యర్థులుగా వారికే ప్రాధాన్యం ఇస్తున్న పార్టీలు

నియోజకవర్గ ముఖచిత్రం – గుంటూరు ఈస్ట్

పట్నంబజారు/నెహ్రూనగర్: గుంటూరు నగరం విద్యా, వైద్య రంగాలకు పెట్టింది పేరు. క్రీస్తు పూర్వం వేంగీ చాళుక్యరాజు శాసనాల్లో గుంటూరును గర్తపురిగా పిలిచే వారు. ఈ ప్రదేశం నీటి కొలనుల మధ్యలో ఉన్న క్రమంలో సంస్కృత భాషలో గుంట అనే పిలిచేవారని, అదీ కాలక్రమేనా గుంటూరుగా మారిందని చెబుతుంటారు. కవిత్రయంలో ఒకరైన తిక్కన సోమయాజీ గుంటూరు ఒక చిన్న గ్రామంగా ఉన్న సమయంలో గ్రామ అధికారిగా ఉండేవారని చరిత్ర చెబుతోంది. ఈ క్రమంలో పాత గుంటూరులో తిక్కన పేరుతో గ్రంథాలయం ఉండగా, పులిపాక పాఠశాలలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈస్ట్ పరిధిలోని కొత్తపేటలో ఉన్న కుగ్లర్ ఆసుపత్రి 1897లో అన్నా సారాకుగ్లర్ ఆధ్వర్యంలో ఆమెరికన్ ఇవాంజిలికల్ లూథరన్ మిషన్ 18 ఎకరాల విస్తర్ణంలో 50 పడకల ఆసుపత్రి నిర్మించబడింది. ఇదీ దేశంలో అత్యుత్తమ ఆసుపత్రుల్లో ఒకటిగా పేరుపొందింది.



గుంటూరు గాంధీ పార్కు

తూర్పు నియోజకవర్గం చరిత్ర

జిల్లాలో 1952 నుంచి ఉన్న గుంటూరు నియోజకవర్గం నుంచి 1955లో గుంటూరు ఈస్ట్ -1 ఏర్పాటు చేశారు. 2008 జరిగిన నియోజకవర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఏర్పడింది. 2014 నాటికి నియోజకవర్గంలో 13 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ అభ్యర్థులు ఎనిమిదిసార్లు, టీడీపీ అభ్యర్థులు మూడు సార్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రెండు సార్లు, సీపీఐ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ నుంచి (16 మినహా) 17 వరకు, 50 నుంచి 57 వరకు డివిజన్లు ఉన్నాయి. మొత్తం 23 డివిజన్లలో 21చోట్ల 2021 సంవత్సరంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 20 వైఎస్సార్ సీపీ గెలుపొందగా, మూడు సీట్లలో టీడీపీ మాత్రమే గెలిచింది.

తూర్పు నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు శాతం ఎక్కువ. దీనితో తెలుగుదేశం పార్టీ 1983లో తొలిసారిగా ముస్లిం అభ్యర్థిని నిలబెట్టడంతో విజయం సాధించింది. అప్పటి నుంచి ప్రధాన పార్టీలు అన్ని ముస్లిం అభ్యర్థులనే ప్రకటిస్తున్నాయి. అయితే 2014 ఎన్నికల్లో మాత్రం ముస్లిం ఓటర్లుతో సమానంగా ఉన్న వైశ్య అభ్యర్థిని టీడీపీ నిలబెట్టింది. అతను ఓడిపోవటంతో రానున్న ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థులనే ఎన్నికల్లో పోటీలోకి పెట్టాలనే ప్రయత్నాలు చేసింది. దీంతో 2019లో తిరిగి ఎండీ నసీర్ అహ్మద్‌కు సీటు ఇచ్చారు. ఆయన ఓటమి పాలయ్యారు.

తూర్పులో రాజకీయం

నియోజకవర్గంలో 13 సార్లు ఎన్నికలు జరిగితే టీడీపీ తరపున ఎస్ఎం జియావుద్దీన్ రెండుసార్లు, కాంగ్రెస్ తరపున మహమ్మద్ జాని మాత్రమే వరుసుగా రెండుసార్లు ఎంపికయ్యారు. ప్రస్తుతం నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీకి చెందిన మహమ్మద్ ముస్తఫా ఎమ్మెల్యేగా ఉన్నారు.

ముఖ్యమైన ప్రాంతాలివే..

- గుంటూరు తూర్పు పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ ఎంతో ప్రధానమైనది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఆర్టీసీ బస్టాండ్ రాష్ట్రంలోనే అతి పెద్ద వాటిల్లో ఒకటి. దశాబ్దాలుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను 1985లో పునరుద్ధీకరణ చేశారు.
- గుంటూరు రైల్వేస్టేషన్ కూడా ఈస్ట్ పరిధిలోనే ఉంది. మొట్ట మొదటి రైలుమార్గం 1916లో గుంటూరు - రేపల్లె మధ్య మీటర్‌గేజ్ రైలుమార్గం ప్రారంభించారు. అనంతరం హుబ్లీ–గోవా మధ్య కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ పూర్తి అయిన తరువాత హౌరా వైపుగా గుంటూరు–విజయవాడ మధ్య ఒక బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మించబడింది. ఇప్పుడు గుంటూరు రైల్వే స్టేషన్ జంక్షన్‌గా ఉంది.
- రాష్ట్రానికే తలమానికంగా గుంటూరు ప్రభుత్వాసుపత్రి.. ఇదీ సైతం తూర్పు నియోజకవర్గంలో ఉంది. 1954 ప్రభుత్వాసుపత్రిని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి జీజీహెచ్‌కు వస్తారు. ముఖ్యంగా ఏడు జిల్లాల నుంచి నిత్యం వస్తుంటారు. నిత్యం నాలుగు వేల మందిపైగానే ఓపీ ఉంటుంది. రూ. 45 కోట్లుతో నాట్కో ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఏపీలోనే మొట్టమొదటిగా అత్యాధునిక క్యాన్సర్ వైద్య సౌకర్యాలతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేశారు. నిద్ర సమస్యలు ఉన్న వారికి స్లీప్ ల్యాబ్ ఏర్పాటు చేసిన పరిస్థితులు ఉన్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణం కాపాడే స్ట్రోక్ యూనిట్‌ను రాష్ట్రంలోనే తొలిగా జీజీహెచ్‌లో ప్రారంభించారు.
- గుంటూరు తూర్పులో ఉన్న గాంధీపార్క్‌కు ఎంతో ఘన చరిత్ర ఉంది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో మహాత్మా గాంధీ ఈ ప్రాంతంలోనే సమావేశం ఏర్పాటు చేశారు. మొదట్లో స్వరాజ్ మైదానంగా పలిచే వారు. ఈ తరువాత గాంధీ పార్క్‌గా నామకరణం చేశారు. టీడీపీ ప్రభుత్వం గాంధీప్కార్‌ను పట్టించుకోని పరిస్థితుల్లో శిథిలావస్థకు చేరింది. గత ఏడాది నవంబర్ 10వ తేదీన రూ 6.25 కోట్లుతో పార్క్ అత్యాధునిక హంగులతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరించి, పునఃప్రారంభించింది.
- భారతదేశంలోనే పురాతన కళాశాలల్లో ఆంధ్రా క్రైస్తవ కళాశాల (ఏసీ కళాశాల) ఒకటి. 1885లో ప్రారంభించగా, సెయింట్ జార్జ్ కళాశాల పోషకుడిగా ఉండేవాడు. కళాశాలలో మాజీ ముఖ్యమంత్రులు, పలు ఐఏఎస్‌లు, ఉన్నత స్థాయి అధికారులు విద్యను అభ్యసించారు.
- 1942లో బ్రిటిష్ వారి పాలనలో మహిళా ప్రభుత్వ కళాశాలను 16 ఎకరాల సువిశాల స్థలంలో ప్రారంభించారు. కోస్తాంధ్రలో పురాతన చరిత్ర గల ఏకైక మహిళా కళాశాలగా ప్రసిద్ధి చెందింది. రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ కళాశాల్లో ఒకటిగి నిలిచింది.
- తూర్పు నియోజకవర్గంలోని ముఖ్యమైన ప్రాంతాలుగా జిన్నాటవర్, నాజ్ సెంటర్, ఆర్.అగ్రహారం, న్యూగుంటూరు రైల్వేస్టేషన్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం సెంటర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు, భగత్‌సింగ్ బొమ్మ సెంటర్, లాంచెస్టర్ రోడ్డు అనేక పేరుగాంచిన ప్రాంతాలు ఉన్నాయి.
- గుంటూరు తూర్పులో నాజ్‌సెంటర్‌లో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి, లాలాపేట పరిధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, కొత్తపేటలోని శ్రీ జగన్నాథస్వామి, కొత్తపేట శివాలయం, పాతగుంటూరు శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్రేశ్వరస్వామి, ఆర్.అగ్రహారం శివాలయం, పట్నంబజారులోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాలు ఎంతో ప్రసిద్ధిగాంచినవి. ఈస్ట్ ప్యారిష్ చర్చి ఎంతో చరిత్ర ఉంది.



జిన్నా టవర్



గుంటూరు బస్‌స్టేషన్

నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	పంపిణీ చేసిన నగదు రూ.
ఆసరా	34116	565624175
అమ్మ ఒడి	34371	1070973500
అమ్మ ఒడి (ఇతరులు)	31738	78169000
అర్చకులు	124	617500
చేదోడు	2349	49085000
క్రాఫ్ ఇన్సూరెన్స్	2441	41997377
ఈబీసీ నేస్తం	2476	37132500
హౌసింగ్ (డీబీటీ)	10076	652893243
ఇమామ్స్	30	147500
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	2270	23906270
జగనన్న తోడు (వడ్డీ)	4838	1605430
జగనన్న తోడు (రుణం)	9965	158170000
జగనన్న వసతి దీవెన	18112	197431100
జగనన్న విద్యాదీవెన	19713	652333681
కళ్యాణమస్తు	168	13307500
కాపు నేస్తం	3378	107617500
లా నేస్తం	32	1920000
మత్స్యకార భరోసా	27	460000
నేతన్న నేస్తం	7	336000
పాస్టర్లు	264	1317500
రైతు భరోసా	16279	706928925
సున్నావడ్డీ పంట రుణాలు	3865	11831466
సున్నావడ్డి	48673	175764659
వాహన మిత్ర	3653	98700000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	8646	70611000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	13773	634523203
వైఎస్సార్ బీమా	698	104701250
వైఎస్సార్ చేయూత	15097	647231250
వైఎస్సార్ పెన్షన్ కానుక	36466	2877246875
మొత్తం	323472	896,96,10,902

హోం ఓటింగ్ 73 శాతం నమోదు

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పులో 73 శాతం హోం ఓటింగ్‌ని శుక్రవారం పూర్తి చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం చౌత్రా సెంటర్‌లో జరుగుతున్న హోం ఓటింగ్‌ని తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో కమిషనర్, ఆర్ఓ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా హోం ఓటింగ్ విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం హోం ఓటింగ్‌కి అమలు చేస్తున్న మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 97 మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమైన హోం ఓటింగ్ లో 97 మంది ఓటర్లకు గాను 71 మంది ఓట్లు పోల్ చేసి 73 శాతం పోలింగ్ జరిగిందన్నారు. శనివారం హోం ఓటింగ్ లో మిగిలిన వారి ఓట్లు పోల్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో కీర్తి

అప్రమత్తంగా ఉండాలి

ఈవీఎంల కమిషనింగ్ విధులు కేటాయించబడిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏసీ కాలేజీలో నిర్వహిస్తున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆర్ఓ మాట్లాడుతూ తూర్పు అసెంబ్లీ ఈవీఎంల కమిషనింగ్ ఏసీ కాలేజిలో జరుగుతుందని, కమిషనింగ్‌కు సెక్టార్ అధికారుల వారీ బాధ్యతలు కేటాయించామన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహంతో మరింత రాణింపు

ఏఎన్‌యూ ప్రొఫెసర్ పూర్ణచంద్రరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా మరింతగా రాణిస్తారని ఏఎన్‌యూ టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ పి. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బహూకరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి, మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వారిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టీడీ విమల తన భర్త డాక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పేరుతో స్మారక నగదు బహుమతులను అందజేశారని తెలిపారు. ఎంబీఏ విభాగంలో ముప్పల అనూష ప్రథమ బహుమతి, బడుగు నవ్యశ్రీ, గొరిగో దేవిక ద్వితీయ, తాటిపాకల మానశ్రీ తృతీయ బహుమతి పొందారని వివరించారు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో గుంటి స్మైలీ ప్రథమ బహుమతితో పాటు ముదమాల నవ్యశ్రీ, జరపాల శిరీష బాయ్ ద్వితీయ, గంగుల లీలా వెంకట్ తృతీయ బహుమతి అందకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంఠ, బి. అనిత, అభిలాష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో పూర్ణచంద్రరావు, ఎస్వీ రమణ, లలిత, తదితరులు

మైనారిటీ సబ్ కోటా రద్దుపై మాట్లాడటం సిగ్గు చేటు

లక్ష్మీపురం: జాతీయస్థాయిలో ఓబీసీ రిజర్వేషన్లలో మైనారిటీ సబ్ కోటా రద్దుపై నోరు ఎత్తని రాజకీయ పార్టీలు ఈరోజు దాదాపు 12 సంవత్సరాల తర్వాత ఎన్నికల సమయంలో మాట్లాడటం సిగ్గు చేటు అని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం పేర్కొన్నారు. స్థానిక తూర్పు నియోజక వర్గ పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4శాతం రిజర్వేషన్లు కల్పించడంపై దాదాపు రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తూ ప్రకటనలు ఇచ్చాయి. సఖ్యతగా ఉంటున్న బీసీ, ముస్లిం వర్గాల మధ్య రాజకీయ చిచ్చు కోసం ఇటువంటి ప్రయత్నాలు చేయటం తగదని చెప్పారు. 2012లో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఆర్ కృష్ణయ్య ను 2014లో తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటన చేసి ఎమ్మెల్యే గా పోటీ చేయించిన పార్టీ కు ఆ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గుర్తుకు రాని జాతీయస్థాయిలో ఓ బి సి కోటాలో మైనారిటీ సబ్ కోటా రిజర్వేషన్ల రద్దు, ఇప్పుడు గుర్తుకు రావడం అందులోనూ ఎన్నికల సమయంలో గుర్తుకు రావటం కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలు సిద్ధం

వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 2వ డివిజన్‌లో ధనమ్మ హోటల్ సెంటర్ నుంచి శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి, పార్టీ నేత సత్యనారాయణలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 98 శాతం అభివృద్ధి పనులు చేపట్టామని, గత పది సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలు తమకుటుంబంపై చూపిస్తున్న అభిమానానికి రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనను గెలిపించేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు యర్రం రామకృష్ణారెడ్డి, యర్రం శ్రీనివాసరెడ్డి, సుజాత రెడ్డి, లక్ష్మీ, మేరి, పల్లా శ్రీను, సులేమాన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు అండగా

జగనన్న ప్రభుత్వంలో వ్యాపారస్తులకు పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని 57వ డివిజన్, వాసవి క్లాత్‌మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. వ్యాపారుల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు, వ్యాపార వర్గాలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైష్ణవి క్లాత్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుదేవ రావు, పీ.ఎస్.ఆర్.గుప్తా, రామారావు, నవీన్ కుమార్, గంగా యాదవ్, మాజేటి మహేష్, రమేష్, కొత్తా వెంకటేశ్వరరావు, బైరిశెట్టి శ్రీనివాస్, పల్లా శ్రీను, వాసవి క్లాత్‌మార్కెట్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో షేక్ నూరిఫాతిమా

పార్టీలో భారీగా చేరికలు

టీడీపీ గుంటూరు పార్లమెంట్ యువత నాయకులు అతవుల్లా ఖాన్ ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్‌కు చెందిన 200 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. బ్రహ్మానంద రెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో జరిగిన చేరిక కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో పఠాన్ అతవుల్లా ఖాన్, షేక్ షబ్బీర్, షేక్ హుమాయున్, షేక్ సికిందర్, షేక్ దావత్, షేక్ జున్ను, షేక్ సలాం, షేక్ ఖలీల్, షేక్ రఫీ, షేక్ ఇషాక్, షేక్ ఖయ్యూం, షేక్ మున్నా, పఠాన్ సుబేదార్ ఖాన్, షేక్ జిలానీ, షేక్ రియాజ్, షేక్ సర్దార్, షేక్ అన్సారీ, షేక్ ఉస్మాన్, షేక్ రియాజ్, పఠాన్ అక్బర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ లోకి చేరికలు

నెహ్రూ నగర్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన, చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్ సీపీ లోకి చేరుతున్నారని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. శుక్రవారం 56వ డివిజన్ చెందిన టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేనలో కార్యకర్తలకు ఆశించిన గుర్తింపు లేదన్నారు. వైఎస్సార్ సీపీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీలు చెందిన కొంగర కృష్ణ, యర్రగోపు శ్రీనివాసరావు(వాసు), కొటికల నాగేంద్ర బాబు(నాని), పార్టీ 56వ డివిజన్ ముఖ్య నాయకులు అయిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

వేసవి శిక్షణతో సృజనాత్మక నైపుణ్యాలకు పదును

గుంటూరు ఎడ్యుకేషన్: బాలల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని హైదరాబాద్‌కు చెందిన లిటిల్ ఎడ్యు ఎంటర్‌ప్రైజెస్ సీఈఓ రమణకుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేట ఆరోలైనులోని హిందూ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం లిటిష్ ఎడ్యు సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా రమణకుమార్, హిందూ ప్రాథమికోన్నత పాఠశాల కార్యదర్శి రామకృష్ణ పరమహంస మాట్లాడారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

నగరంపాలెం: ఈనెల 13వ తేదీన ఓటర్లు అందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్ కోరారు. ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–1 స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఓటర్ల అవగాహన, ర్యాలీ నిర్వహించారు. సెబ్ గుంటూరు–1 స్టేషన్ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా మద్యాన్ని పంపిణీ చేసిన, నిల్వ చేసి రవాణా చేసిన వారి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.తులసి, ఆర్టీసీ/ సెబ్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com